కుయుక్తుల గంటా.. మరో మోసం

- 'భీమిలి మేనిఫెస్టో' పేరుతో ఓవరాక్షన్
- గతంలో విశాఖ ఉత్తర మేనిఫెస్టో పేరుతో ఇదే తరహా హడావిడి
- ఎన్నికల్లో గెలిచిన తర్వాత అటువైపు కన్నెత్తి చూడని వైనం
- భీమిలి ప్రజలను మరోసారి మోసం చేసేందుకు అడ్డగోలు హామీలు

తగరపువలస / ఎంవీపీ కాలనీ : ఎన్నికలు జరిగిన ప్రతీసారి ఆయా నియోజకవర్గాలను మార్చి... ప్రజలను వంచించడమే పనిగా పెట్టుకున్న గంటా శ్రీనివాసరావు తాజాగా మరో మోసానికి తెరలేపారు. భీమిలి ప్రజలను మరోసారి మోసం చేసేందుకు మేనిఫెస్టో పేరుతో ముందుకొచ్చారు. కూటమి మేనిఫెస్టోను పక్కనపెట్టి మరీ తన సొంత బాకా ఊదుకునేందుకు 'భీమిలి 'మేనిఫెస్టో' పేరిట కొత్తరాగం అందుకున్నారు. అబద్ధాలకు రెక్కలు కట్టిన ఈ మేనిఫెస్టో విడుదలకు బుధవారం ఎంవీపీ కాలనీలోని ఆయన నివాసం వేదికైంది. గతంలోనూ ఇదే తరహా హామీలతో విశాఖ ఉత్తర నియోజకవర్గ ఓటర్లను వంచించి గంటా గెలిచిన విషయం తెలిసిందే. ఉత్తర నియోజకవర్గాన్ని రాష్ట్రంలో మోడల్‌గా తీర్చిదిద్దుతానంటూ ప్రగల్భాలు పలికిన ఆయన... తీరా ఎమ్మెల్యేగా గెలుపొందాక కనీసం ఆ నియోజకవర్గం వైపు ఒక్కసారి కూడా కన్నెత్తి చూడలేదు. అక్కడి ప్రజలను కనీసం పట్టించుకోలేదు. ఈ సారి 'విశాఖ ఉత్తర'లో తన ఆటలు సాగవని గుర్తించిన గంటా.. షరా మామూలుగా నియోజకవర్గం మార్చేశారు. మరోసారి భీమిలి నియోజకవర్గ ఓటర్లను వంచించడమే లక్ష్యంగా మేనిఫెస్టోను విడుదల చేశారు. ఓటమి భయంతో ఇప్పటికే ప్రచారంలో అడ్డదారులు తొక్కుతున్న గంటా.. సొంత బాకాతో భీమిలి ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమయ్యారు.



ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవతో రూ.6.50 కోట్లతో అభివృద్ధి చేస్తున్న చిట్టివలస చెరువు వాకింగ్ ట్రాక్... దీనినే మళ్లీ అభివృద్ధి చేస్తానని మేనిఫెస్టోలో గంటా చెబుతుండడం హాస్యాస్పదం

ఓయబ్బో.. భీమిలిని అభివృద్ధి చేశాడంటా.?

గతంలో భీమిలి ఎమ్మెల్యేగా పనిచేసిన గంటా రూ.3,500 కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసినట్లు వెల్లడించడం పలువురిని ఆశ్చర్యానికి గురి చేసింది. నియోజకవర్గాన్ని భూ కబ్జాలకు కేంద్రంగా మార్చి భీమిలిని అప్రతిష్ట పాలుచేసిన గంటా.. చేసిన అభివృద్ధి ఏంటో చెప్పాలని అతనిపై సోషల్ మీడియాలో సెటైర్లు చక్కర్లు కొడుతున్నాయి. భీమిలి మేనిఫెస్టో పేరుతో ప్రకటించిన హామీలు నియోజకవర్గ ప్రజలతోపాటు ఎన్నికల విశ్లేషకులను సైతం అవాక్కయ్యేలా చేస్తున్నాయి. ఆసియాలోనే అతిపెద్ద టౌన్‌షిప్ నిర్మాణం, ఆనందపురంలో మోడ్రన్ పూల మార్కెట్, భీమిలిలో అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం, మినీ జెట్టీ, కోల్డ్ స్టోరేజ్, అంతర్జాతీయ ప్రమాణాలతో స్పోర్ట్స్ స్టేడియంలు, ఆనందరపురం, పద్మనాభంలో అతిపెద్ద ఐటీ సెజ్‌లు.. ఇలా నోటికొచ్చినవి ప్రకటించేశారు. గెలుపు కోసం ఎంతకైనా తెగించే గంటా అడ్డగోలు అబద్ధాలకు ఈ హామీలే నిదర్శనమని ఎన్నికల విశ్లేషకులు, ప్రజలు అభిప్రాయపడుతున్నారు. వాస్తవానికి భీమిలి ప్రజలకు 2014లో గంటా ఇచ్చిన హామీల్లో... 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చాలా వరకు నెరవేర్చారని స్థానికులు గుర్తు చేస్తున్నారు. టీడీపీ చేయలేని చిట్టివలస జ్యూట్‌మిల్లు కార్మికుల సమస్యల పరిష్కారం, అనంత పద్మనాభస్వామి కొండకు ఘాట్‌రోడ్డు నిర్మాణం, రైతుబజారు నిర్మాణం, తాగునీరు సరఫరా, మధురవాడకు ఐటీ కంపెనీలు తీసుకొచ్చారని చెబుతున్నారు. గత నియోజకవర్గాల్లో గంటా చేసిన అభివృద్ధి ఏంటో విశ్లేషించుకుని.. ఈ ఎన్నికల్లో ఆయనకు గట్టి జవాబు ఇవ్వాలని పలువురు పిలుపునిస్తున్నారు.

బస్ కాంప్లెక్స్ హామీ అప్పటిదే..



తగరపువలసలో రూ.7 కోట్లతో ఆర్టీసీ కాంప్లెక్స్, డిపో నిర్మిస్తామని 2016లో అప్పటి మంత్రి గంటా శ్రీనివాసరావు మాజీ మంత్రి అప్పలనరసింహరాజు సమక్షంలో శిలాఫలకం వేశారు. తర్వాత మూడేళ్లు అధికారంలో ఉన్నా పూర్తి చేయలేకపోయారు. మళ్లీ ఇప్పుడు మేనిఫెస్టోలో చేర్చారు.

– దుంపల నాగమణి, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు, తాటితూరు

సూయిజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏదీ..?



2016లో అప్పటి మంత్రి గంటా శ్రీనివాసరావు భీమిలి జోన్‌లో రూ.1.20 కోట్లతో సూయిజ్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మిస్తానని భీమిలి రోడ్డులో శిలాఫలకం కూడా వేశారు. ఇప్పటికీ శిలాఫలకం అలాగే ఉంది కానీ ప్లాంట్ నిర్మాణం జరగలేదు. ఇప్పుడు మళ్లీ మేనిఫెస్టోలో చేర్చడంతో ఆశ్చర్యపోతున్నాం.

– చిల్ల గణేష్‌రెడ్డి, చిల్లపేట

ముత్తంశెట్టి చొరవతో చెరువు అభివృద్ధి



2019 ఎన్నికల ముందు చిల్లపేట చెరువును అభివృద్ధి చేస్తామని గంటా శిలాఫలకం వేశారు. కానీ అసంపూర్తిగా వదిలేశారు. ప్రస్తుతం భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెరువు అభివృద్ధి పనులను రూ.6.50 కోట్లతో చేపడుతున్నారు.

– జీరు మహేష్‌రెడ్డి, జీరుపేట

జగన్ పాలనలో ఇనాం రైతులకు న్యాయం



నియోజకవర్గంలో ఇనాం రైతులకు టీడీపీ ప్రభుత్వం న్యాయం చేయలేక పోయింది. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇనాం రైతులకు సాధారణ రైతుల్లాగే రైతు భరోసా, బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించారు. – మిగిలిన సమస్యలను కూడా కొలిక్కి తెస్తున్నారు.

– సాడి జాంబిరెడ్డి, రైతు, తాటితూరు

ఏయూఈఈటీలో తగరపువలస విద్యార్థికి 3వ ర్యాంకు



గిడుతూరి మోహన్ సాయి సంపత్

తగరపువలస : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇటీవల ఇంజినీరింగ్ సెల్ఫ్ సపోర్ట్ విధానంలో (ఏయూఈఈటీ) నిర్వహించిన ప్రవేశ పరీక్షలో తగరపువలస రామవీధికి చెందిన గిడుతూరి మోహన్ సాయి సంపత్‌కు 64 మార్కులతో 3వ ర్యాంకు లభించింది. రాష్ట్ర వ్యాప్తంగా 14 కేంద్రాల్లో 4,349 మంది విద్యార్థులు ఈ పరీక్ష రాశారు. ఈ సందర్భంగా సాయి సంపత్‌ను పలువురు అభినందించారు.

'శ్రీకృష్ణా' విద్యార్థుల ప్రతిభ

తగరపువలస : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫస్ట్ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో చిట్టివలస శ్రీకృష్ణా కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని కరస్పాండెంట్ బి.నరసింగరావు తెలిపారు. బీఎస్సీ కెమిస్ట్రీలో వి.షైడిరాజు 8.60 పాయింట్లతో మండలంలోనే మొదటి స్థానం సాధించారన్నారు. ఇంకా కె.సింధు 8.45 పాయింట్లు సాధించినట్టు తెలిపారు. 30 మంది విద్యార్థులు 8 పాయింట్లకు పైగా, 60 మంది 7 పాయింట్లకు పైగా సాధించారన్నారు. 99 శాతం ఉత్తీర్ణత సాధించిన తమ విద్యార్థులను ప్రిన్సిపాల్ జరజాపు సతీష్, అధ్యాపకులు అభినందించారు.

గాయత్రి విద్యార్థుల సత్తా

ఆనందపురం గాయత్రి డిగ్రీ కళాశాల విద్యార్థులు ఫస్ట్ సెమిస్టర్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించినట్టు డైరెక్టర్ రామకృష్ణ తెలిపారు. మన్యాల భూమిక, కడియం దేవి, కొట్యాడ రమ్య, దొంతల అఖిల, వెన్ని శ్రావణి ఉత్తమ ఫలితాలు సాధించినట్టు ప్రిన్సిపాల్ అప్పలరాజు, కరస్పాండెంట్ వెంకటరావు తెలిపారు.

గర్భిణులందరికీ వైద్య సేవలందించాలి

తగరపువలస : మండలంలోని ప్రతీ గర్భిణికి వైద్య సేవలు అందేలా ఆశ కార్యకర్తలు కృషి చేయాలని ఆనందపురం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.గంగునాయుడు కోరారు. పీహెచ్‌సీలో బుధవారం నిర్వహించిన ఆశ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గర్భిణులకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. క్రమం తప్పకుండా అన్నిరకాల పరీక్షలు చేయించాలన్నారు. ఈ సేవలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలన్నారు. హైరిస్క్ గర్భిణుల పట్ల ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వారిని ఆస్పత్రులకు తీసుకొచ్చేటప్పుడు తల్లీబిడ్డ వాహనం, 108 వాహనాల సేవలు వినియోగించుకోవాలని సూచించారు. అలాగే టీబీ వ్యాధి రాకుండా పెద్దలకు వేసే అడల్ట్ బీసీజీ టీకా ఈ నెలలో ప్రారంభించాలన్నారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. సామాజిక ఆరోగ్య కార్యకర్త పి.సాంబమూర్తి, ఆరోగ్య పర్యవేక్షకులు పార్వతమ్మ, కృష్ణమోహన్, టీబీ సూపర్‌వైజర్లు వీరబ్రహ్మం, సురేష్, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యుడు గంగునాయుడు

పక్కాగా హోం ఓటింగ్

భీమునిపట్నం: భీమిలిలో ఓటు వేయడానికి పోలింగ్ బూత్‌లకు రాలేని వృద్ధులు తమ ఇళ్ల వద్ద ఓటు వేసుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిన మేరకు బుధవారం పక్కాగా హోం ఓటింగ్‌ను అధికారులు నిర్వహించారు. ఇక్కడి 19వ సెక్టార్ పరిధిలో మొత్తం 20 ఓట్లు ఉండగా సిబ్బంది ఆయా ఇళ్లకు వెళ్లి ముందుగా ఓటు ఎలా వేయాలన్న దానిపై అవగాహన కల్పించారు. అనంతరం బ్యాలెట్ పేపర్లను వారికి అందివ్వగా అసెంబ్లీ అభ్యర్థికి, ఎంపీ అభ్యర్థికి ఓట్లు వేశారు. కాగా ఈ ప్రక్రియ నిర్వహన విషయంలో అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. వీడియో షూటింగ్ కూడా నిర్వహించారు. ఇదిలా ఉండగా ఉద్యోగుల పోస్టల్ ఓటింగ్‌కు సంబంధించి నియోజకవర్గ స్థాయిలో మొత్తం 1178 ఓట్లు ఉండగా రెండో రోజు 396 ఓట్లు పోలయ్యాయి. మంగళవారం మొదటి రోజు 321 ఓట్లు పోలయ్యాయి. దీంతో ఇప్పటి వరకు మొత్తం 717 ఓట్లు పోలయ్యాయి.



ఓటు వేయడంపై వృద్ధురాలికి అవగాహన కల్పిస్తున్న అధికారి

థీమ్ పార్కులు అదుర్స్

డెవలప్‌మెంట్ వాచ్

ఉరుకులు పరుగుల జీవితంలో అలసిపోయే నగర జీవులు ప్రశాంతంగా సేద తీరేందుకు అద్భుతమైన థీమ్ పార్కులు అందుబాటులోకి వచ్చాయి. ఐదేళ్ల క్రితం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పార్కుల సుందరీకరణ, అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిచ్చారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవతో నియోజకవర్గంలోని 70 పార్కులను జీవీఎంసీ అధికారులు గుర్తించి పరిరక్షణ చర్యలు చేపట్టారు. ముఖ్యంగా జీవీఎంసీ 6, 8 వార్డుల్లో నాలుగు థీమ్ పార్కులను రూ.6.8 కోట్లతో అభివృద్ధి చేశారు. పీఎం పాలెం ఆఖరి బస్టాప్ సమీపంలో రూ.1.9 కోట్లతో యోగా థీమ్ పార్కు, బక్కన్నపాలెం లచ్చిరాజు లే అవుట్ సమీపంలో రూ.1.5 కోట్లతో స్పోర్ట్స్ థీమ్ పార్కు, జాతీయ రహదారిని ఆనుకుని ఎంఎస్ఆర్ లే అవుట్ సమీపంలో రూ.1.9 కోట్లతో బటర్ ఫ్లై థీమ్ పార్కు, రుషికొండ వైఎల్‌పీ లే అవుట్ సమీపంలో రూ.1.5 కోట్లతో ఫామ్ గార్డెన్ థీమ్ పార్కు అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకురావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆహ్లాదంతోపాటు ఆరోగ్యాన్ని పరిరక్షించుకునేందుకూ దోహదపడుతున్నాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. – మధురవాడ

స్పోర్ట్స్ థీమ్ పార్కులో ఏర్పాటు చేసిన కళాఖండం





స్పోర్ట్స్ థీమ్ పార్కులో ఏర్పాటు చేసిన పిల్లల ఆట సామగ్రి



రుషికొండ వైఎల్‌పీ లే అవుట్ సమీపంలోని ఫామ్ గార్డెన్ థీమ్ పార్కులో పచ్చదనం



యోగా థీమ్ పార్కులో పచ్చదనం

ప్రచార పర్వం



తగరపువలస : సంతపేటలో ప్రచారంలో జీవీ రమణ, జీరు సుజాత, సృజన, చిల్ల సతీష్, దండి మోహన్, ఆదిలక్ష్మి, నారాయణమ్మ, కనకదుర్గ, గౌరి



తగరపువలస : చిల్లపేటలో ప్రచారం నిర్వహిస్తున్న బింగి హరికిరణ్, జీరు వేణుగోపాల్‌రెడ్డి, సరగడ శివాంజనేయరెడ్డి, మునకాల ఆదినారాయణరెడ్డి, చిల్ల సూరి నరసయ్యరెడ్డి, దెక్కతి శ్రీనివాసరెడ్డి



తగరపువలస : గొల్లవీధిలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ 2వ వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, చిప్పాడ వెంకటేష్, తెడ్లాపు అప్పలరాజు, చిప్పాడ కనకరాజు, మద్ది మహాలక్ష్మి, దుర్రి రామయ్యమ్మ, ఇంజే వరలక్ష్మి, కొయ్య వెంకటలక్ష్మి



తగరపువలస : సబ్బివానిపేటలో ప్రచారం నిర్వహిస్తున్న వార్డు ఇన్‌చార్జి శిల్లా సరళారాణి, జీరు వెంకటరెడ్డి, కంచుబోయిన వెంకటరావు, చిల్ల ప్రమీల, నీలాతి రాము, గొల్లు ప్రసాద్, నమ్మి భాస్కరరావు



భీమునిపట్నం : జీవీఎంసీ 3వ వార్డులో ప్రచారంలో కొంకి వెంకటేష్, ఆర్.ప్రభాకర్‌నాయుడు, దారపు గౌరి వరప్రసాద్, డి.గురునాథరెడ్డి, మొకర నర్సింగరావు, వెంకటరత్నం, సంతోష్, సూరిబాబు, బాలకృష్ణ, రాజశేఖర్, నూకరాజు



తగరపువలస : సంగివలసలో ప్రచారం నిర్వహిస్తున్న అక్కరమాని గంగాధర్, పీతల వెంకట అప్పారావు, బెల్లాన వెంకటరావు, గృహసారథులు



మధురవాడ : జీవీఎంసీ 6వ వార్డు రేవళ్లపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న పిల్లా సత్యనారాయణ, చంద్రహాస్, పిల్లా సూరిబాబు, వాండ్రాసి శ్యామల, వాండ్రాసి సూరి అప్పారావు, బెవర బాపూజీ

జగన్ పాలనలోనే మత్స్యకారులకు భరోసా



జీవీఎంసీ 4వ వార్డు చేపలుప్పాడలో ప్రచారంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కొమ్మాది : మత్స్యకారులకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలోనే మంచి జరిగిందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. గతంలో టీడీపీ పాలనలో మత్స్యకారులను తొక్క తీస్తా, తోలు తీస్తా అంటూ హేళన చేశారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మత్స్యకారులను రాజ్యసభకు పంపించి, మంత్రిని చేసి ఉన్నత స్థానంలో జగనన్న నిలిపారని కొనియాడారు. జీవీఎంసీ 4వ వార్డు చేపలుప్పాడలో బుధవారం సాయంత్రం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మత్స్యకారుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేసిన ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారంటే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. టీడీపీ హయాంలో మత్స్యకారులకు వేట విరామ భృతి రూ.4 వేలు ఇస్తే... సీఎం జగన్ పాలనలో రూ.10 వేలు ఇస్తున్నారని గుర్తు చేశారు. డీజిల్ సబ్సిడీ, 50 ఏళ్లకే పింఛన్ అందించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఇటీవల ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన మత్స్యకారులకు 80 శాతం నష్టపరిహారం అందించి ఆదుకున్న మనసున్న నాయకుడు జగన్ మోహన్‌రెడ్డే అన్నారు. తాను ఎమ్మెల్యే అయిన తర్వాత కేవలం 4వ వార్డులోనే రూ.33 కోట్ల విలువ చేసే సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా అందించామన్నారు. 400 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశామని గుర్తు చేశారు.

కష్టకాలంలో 'గంటా' కనిపించ లేదు

గంటా శ్రీనివాసరావు గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు హుదుహుద్ తుఫాన్ సంభవిస్తే తీర ప్రాంత మత్స్యకారులను కనీసం పరామర్శించలేదని, నష్టపోయిన వారికి ఆర్థిక సహకారం అందించలేదని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ప్రస్తుతం ఎన్నికల్లో లబ్ధి కోసం మత్స్యకారుల వద్దకు వచ్చి ఓటు వేయాలని ఎలా అడుగుతారని ప్రశ్నించారు. తీర ప్రాంతంలో రక్షణ గోడ నిర్మిస్తామని గంటా చేసిన వాగ్దానం కలగానే మిగిలిపోయిందన్నారు. కష్టకాలంలో కనిపించని గంటా శ్రీనివాస్ కావాలో..., కష్టంలో తోడుండే ముత్తంశెట్టి శ్రీనివాస్ కావాలో మత్స్యకారులే నిర్ణయించుకోవాలన్నారు.

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని కోరారు. ప్రచారంలో వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, వార్డు అధ్యక్షుడు పాల రమణారెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి బోర రామకృష్ణ, నాయకులు బాడిదబోయిన రాములప్పడు, దూడ అచ్చారావు, మేరుగు చిన్నారావు, వాండ్రాసి సన్యాసిరావు, నాగోతి సింగన్న, తొత్తడి అప్పన్న, జగన్నాథ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

'గంటా'కు ఓట్లడిగే హక్కు లేదు

- ఈ ఎన్నికల్లో భంగపాటు తప్పదు
- ప్రజలంతా జగన్‌నే కోరుకుంటున్నారు
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పీఎం పాలెం : ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజలకు ముఖం చూపించే టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావుకు ఓట్లు అడిగే హక్కు లేదని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 5వ వార్డు పరిధి శివశక్తినగర్, ముత్యాలమ్మ కాలనీ, అయ్యప్పనగర్, శ్రీలక్ష్మీ నగర్ కాలనీల్లో ఆయన బుధవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంటాది ఆర్భాటమే తప్ప ప్రజల సమస్యలు ఏనాడూ పట్టించుకోలేదని ఆరోపించారు. మధురవాడ శివశక్తినగర్ రోడ్డు అభివృద్ధి చేశానని, తాగునీటి సమస్య పరిష్కరించానని, నియోజకవర్గం పరిధిలో 10 ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల ముంగింటకు వైద్య సేవలు తీసుకొచ్చామన్నారు. సీఎం జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావడం తథ్యమని స్పష్టం చేశారు. సుందర విశాఖను రాజధానిగా తీర్చిదిద్ది, ఉత్తరాంధ్రను మరింత అభివృద్ధి చేస్తారన్నారు. సంక్షేమ పథకాలు ఇంటింటికీ అందజేసిన ఘనత జగనన్న ప్రభుత్వంలో మాత్రమే సాధ్యమైందన్న వాస్తవం ప్రజలు గుర్తించారన్నారు. టీడీపీ కల్లబొల్లి మాటలు నమ్మి వారికి ఓటేసి మోసపోయేంతటి అమాయకులు కాదన్నారు. టీడీపీ నాయకులు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారని, ప్రజలను వంచించడానికి ప్రలోభాలకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో వైఎస్సార్ సీపీ 5వ వార్డు అధ్యక్షుడు పోతిన హనుమంతరావు, బగాది లక్ష్మణరావు, సీహెచ్ శ్రీనివాసరావు, నూకారపు బాబ్జీ, పోతిన సురేష్, గణేష్ పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



జీవీఎంసీ 5వ వార్డులో ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల కోలాహలం